"ఏమి, అలా చూస్తున్నావ్?"

అనటి దగ్గరగా వినిపించిన స్వరానికి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి మాధురి ముఖంలోకి దేన్నో వెతుక్కుంటున్నట్లుగా దీక్షగా చూడసాగాడు కృష్ణ.

అతన్ని విచిత్రంగా చూసి, తను తీసుకువచ్చిన కాఫీకప్పును అతనికి దగ్గరగా టేబిల్ మీద ఉంచింది.

"సారీ! మీరేదో అడిగారు కదూ? అదిగో అటు చూడండి. మీ అమ్మాయిలాగే మిమ్మల్ని చూస్తున్నాను." అని తాను సర్దుకుని, టేబిల్ మీద ఓ గాలి మీద కూర్చున్న వాడుకాస్తా ఒళ్ళో పోగుతున్న మాగజైన్ని అటుతు వదిలి, లేచి, కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు.

అతని వెనకే వెళ్ళింది మాధురి.

నీలపు ఆకాశంలో జాళ్ళు జాళ్ళుగా తునకలైన్న నదురుకుని ఉన్న తెల్లటి మబ్బు చివర్లు సూర్యుడి చివరి కిరణాలతో ఆడుకుంటూ వింతగా మెరుస్తున్నాయి.

లేత నీలిరంగు చీరమీద పిడాలు కనిపించకుండా చుట్టూ వచ్చి, మోకాళ్ళ చుట్టూ చేతులు బిగించి, మెడ కొంచెం పైకెత్తి అడ్డంగా ధనుస్సులా వంపు తిరిగిపోతున్న పావురాల గుంపును తదేకంగా చూస్తున్న సుజాతను చూసి, నవ్వింది మాధురి.

"కొత్తగా చూస్తున్నావయ్యా ఈ విషయాన్ని!"

"కానీ, మీరు... సుజా వయసులో ఉండగా అంత నిశ్శబ్దంగా ఉండగా నేనెప్పుడూ చూడలేదు." కృష్ణ అన్నాడు.

ఇంతలో గేటు తీసిన చప్పుడు, కారు హారన్ వినిపించి, "అదుగో, మీ బావగారు వచ్చినట్లున్నారు" అంటూ మెరుపులా ఆ గదిలోంచి అదృశ్యమైంది మాధురి.

అప్పటి వరకూ ఇంకా ఒడిలో ఉండడం కృష్ణకు ఆశ్చర్యం కలిగించినా భర్త రాక ఆమెలో కలిగించిన ఉత్సాహం అతనిలో అసూయ లాంటి భావాన్ని గుచ్చింది.

క్షణాలు గడిచింపుతో తనని తాను సర్దుకుని, నెమ్మదిగా ఆ గదిలోంచి తోటలోకి నడిచాడు.

"సుజా ఏదీ?" ప్రశ్నలు అడగడం తప్ప జవాబు కోసం ఆగే ఓపిక లేదు భాస్కరానికి.


"ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధిస్తూ ఆ మొక్కల దగ్గర కూర్చుంది. ప్రస్తుతం నేనూ అక్కడికే వెళుతున్నాను, మిమ్మల్ని డిస్టర్బ్ చేయకూడదనే నుంచి ఎగ్జిట్."

"ఓ, థాంక్యూ." నవ్వుతూ లోపలికి వెళ్ళిపోయాడు భాస్కరం.

అడుగుల శబ్దానికి తల తిప్పి, "ఓ మీరా! రండి" అంటూ ఆహ్వానించింది సుజాత, కృష్ణను.

"ఏమిటి చదువుతున్నావ్?" పొడిగా కొంచెం పక్కకి తొలగి కూర్చున్నాడు.

"శరత్."



# నన్ను నన్నుగా ప్రేమించు

ఇంద్రరేణి

భాస్కరంతో ఏవో కబుర్లు చెప్తూ వరండా మెట్లెక్కుతోంది మాధురి. పెదాలు కదలకుండా నవ్వుతూ సమాధానంగా తల ఊపుతూ వస్తున్నాడు అతను.

"హల్లో, కృష్ణా! ఏమిటీ వేళ కాలేజ్ నుంచి త్వరగా వచ్చేసినట్లున్నావ్?" పలకరించాడు.

"మీ ఆడాళ్ళకు బాగా నచ్చుతుంది ఆ పుస్తకం."

"అంటే మీకు కూడా చదివాకనే గా అర్థం?" నవ్వింది సుజాత.

"సెల్ఫ్ రైటింగ్ వదలకుండా చదివించేలా చేస్తుంది." అనే అంది మళ్ళీ.

"ఎప్పుడూ పుస్తకాలు, పుస్తకాలు. మీ అమ్మలా చైతన్య సమంతిలా కనిపించ

నేం ఎప్పుడూ?" విసుగుదలను గొంతులో దాచేసి అన్నాడు కృష్ణ.

ఒక్క క్షణం అర్థం కానట్లుగా అతన్ని చూసింది సుజాత. "పోలికలు ఒకటయినంత మాత్రాన ప్రవృత్తులు కూడా అలానే ఉండాలని ఎక్కడా లేదుగా"— నెమ్మదిగా అంది.

"అఫ్‌కోర్స్! నీ వయసులో ఉండగా మాధురి. . . సారీ! మీ అమ్మ ఎలా ఉండేదో తెలుసా?"

"చెప్పండి." ఏదో యాంత్రికంగా అంది సుజాత. కృష్ణ కదిపించగానే ఆమె కళ్ళలో చిందులేసిన మెరుపులు కనురెప్పల చాటున కరిగిపోతున్నాయి.

"కోపం వచ్చినట్లుంది నీకు." కళ్ళలోకి చూసి నవ్వాడు కృష్ణ.

"చీకటి పడుతూంది. లోపలికి వెళదాం పద." జాప్యానికి లేచి చేయి అందించాడు.

అతని బలమైన చేతిలో గువ్వపిట్టలా ఒదిగిపోయిన తన మెత్తని చేతిని విడిపించు కునేందుకు ప్రయత్నించలేదు సుజాత.

వరండా మెట్లెక్కబోతూ, ఆగి ఆమె వైపు తిరిగి, "మనం ఇప్పుడు అలా ఎక్కడైనా వెళ్ళి వస్తే ఎలా ఉంటుంది?" అని అడిగాడు హఠాత్తుగా.

నిశ్శబ్దంగా నవ్వింది ఆమె. "బాగానే ఉంటుంది. మీ వాహనాన్ని స్టార్ట్ చేసి ఉంచండి. నేను లోపలికి వెళ్ళి చెప్పి వస్తాను."

. . .

"తలుపు తీయునంతలోనే. . . ఉత్తరమది ఏలనోయి. . ."

కాలింగ్‌బజర్ మీదచేయి వేయబోయి వెనక్కి తీసుకుని వరండాలో వేసి ఉన్న పేముకుర్చీలో నిశ్శబ్దంగా వాలి కళ్ళు మూసుకున్నాడు కృష్ణ.

'ఆ కంఠంలో మాధుర్యం ఇప్పటికీ మెత్తగా ఎంత హాయిగా ఉందో!'

ఆశ్చర్యంలోనుంచి గతంలోకి వెళ్ళింది అతని మనసు. . .

'చదువు అయిపోయిందా?' దగ్గరికి వచ్చి పక్కనే నిలబడ్డ కృష్ణను అడిగింది మాధురి. తల ఊపాడు సమాధానంగా.

'మరైతే మీ ఇంటికి వెళ్ళి పడుకో.'

'ఊహూఁ నీ దగ్గరే పడుకుంటాను.'

నవ్వి, దగ్గరికి తీసుకుంది కృష్ణను.


'కథ చెప్పు.' యథాప్రకారం పాట మొదలెట్టాడు.

'రోజూ కథ లెక్కణ్ణించి వస్తాయి? కళ్ళు మూసుకుని బంగారులాగా పడుకో.'

'పాట పాడు.'

లేచి కూర్చుంది మాధురి. 'ఏం పాట కావాలి?' నవ్వింది.

'నువ్వెప్పుడూ పాడతావే— కృష్ణా అని? అది.'



చిత్రం — [illegible]

ఓ సారి కృష్ణ వైపు ఆశ్చర్యంగా చూసి నవ్వేసింది మాధురి. వాడి బుగ్గలు మెలి పెడుతూ, 'పాటల్లేవు, గీటల్లేవు. కళ్ళు మూసుకు నిద్రపో' అంది. అలిగినట్లుగా రెప్పలు దించుకున్నాడు.

నవ్వుకుంటూ రాగం మొదలెట్టింది మాధురి. 'తలుపు తీయునంతలోనే. . .'

చల్లని గాలి ఊయలలో మెట్టు అనరించుకున్న విశ్వద్వార్ని తోకాడుతూ లేనివాగు జలజలా కదులుతున్నట్లుగా ఉన్న ఆ స్వరానికి మత్తుగా కళ్ళు మూసుకున్నాడు కృష్ణ.

నుదుటిమీద పడ్డ జుత్తును వేలికొసలతో వెనక్కి కదిలించింది మాధురి. ఆ స్పర్శకు మెల్లిగా కళ్ళు తెరిచి పెదాలు కదిలీ కదలనట్లుగా నవ్వాడు కృష్ణ.

'ఏయ్, దొంగ! ఇంకా నిద్ర పోలేదూ!'

'మాధురీ! నువ్వు వాణ్ణి బాగా దగ్గరికి చేర్చేస్తున్నావమ్మా! రేపు మీ నాన్నగారికి ఏ ట్రాన్స్‌ఫరో వచ్చి ఇక్కడినుంచి మీరు వెళ్ళిపోతే వీడితో ఛాకొస్తుంది నాకు.' కృష్ణను బలవంతాన లేపి తీసుకువెళ్ళింది కృష్ణ వాళ్ళ అమ్మ.

• • •

"అరె! మీ రెప్పుడొచ్చారు? ఒంటరిగాఇక్కడేకూర్చుండిపోయారేం?"

ఎదురుగా నిలబడి ఆశ్చర్యంగా అడుగు తున్న సుజాతను చూసి, "మీ అమ్మ నిలా పిలు, సుజా. కంగ్రాట్స్ చెప్పాలి" అన్నాడు కృష్ణ.

"అమ్మ, నాన్నగారు ఏదో గెట్టుగెదర్ పార్టీకి వెళ్ళారు. ఇంతకీ కంగ్రాట్స్ ఎందుకూ?"

"అంత అద్భుతంగా పాడింది మీ అమ్మ కాదా? మరైతే ఎవరూ?"

"ఇంట్లో నేను తప్ప మరెవ్వరూ లేరు." ఉదాసీనంగా అంది.

"అయితే, ఆ పాట పాడింది. . . నువ్వేనా, సుజా? నిజం? ! హౌ లక్కీ ఐయామ్!" చేతులు పట్టుకుని ఊపే స్తుంటే ముఖం చిట్లించి మౌనంగా ఉండిపోయింది సుజాత.

"ఈ పాటను మీ అమ్మ ఇలాగే— అచ్చు ఇలాగే—తీగలా పాడే ఆ బంగారు గొంతుతో పాడుతుంటే ఎంత హాయిగా ఉండేదనుకున్నావ్! నువ్వు ఈ వేళ మళ్ళీ నన్ను ఆ రోజుల్లోకి తీసుకుపోయావ్ నీ పాటతో. సుజా! నా సంతోషాన్ని ఎలా చెప్పాలో తెలియడం లేదు. నా ఫ్రెండ్‌కి ఘంటసాల పాటలంటే తగని క్రేజ్. వింటూ ఆ మాధుర్యాన్ని భరించలేక ఆ గొంతును కొరికేయా లనిపిస్తుందోయ్ అనేవారు."

"అమ్మ పాట వింటూ ఉన్నప్పుడు మీకూ అలానే అనిపించేదా?".

మామూలుగా ఉండాలని ప్రయత్నిస్తూ అడిగింది సుజాత.

"హో హో! అప్పుడు నేను చాలా చిన్నవాణ్ణి. అయినా, నాది అంత రాక్షస ఆరాధన కాదు. కానీ, ఇప్పుడు. . . అంత తీయగా పాడిన నీ ఈ పెదాలను ముద్దు పెట్టుకోవాలనిపిస్తూంది." ముందుకు వంగి నెమ్మదిగా అన్న ఆ తీరుకు కొద్దిగా వణికింది సుజాత.

"ఏ రకమైన కాంప్లిమెంట్స్ అందు కోవాలని పాడలేదు నేను."

"కానీ, 'కృష్ణా' అని పిలిచింది నన్నేగా?" నవ్వాడు.

"అందుకేనా వెంటనే దర్శన మిచ్చారు!"

"నా స్నేహితుడు ఓ ఫ్రెండ్ తీసుకు పోయాడు. పొద్దుటినుంచి రూమ్‌లో ఉండీ ఉండీ విసుగేసి ఇలా పారిపోయి వచ్చాను."

"మంచి పని చేశారు. చెస్ తీసుకు రానా? ఆడుకుందాం."

"చెస్సా? దానితో కూర్చుంటే తెల్లారుతుంది. అసలు మీ ఇంటికి ఇంత ఎండలో పడి ఎందుకొచ్చానో తెలుసా?"

"విసుగేసి అన్నారుగా? అయినా, ఎండెక్కడుంది? ఈ వేళ ఆకాశం చాలా ప్లెజెంట్‌గా ఉంది." నవ్వుతూ చూసింది అతని వైపు.

"అందుకేనోయ్ నలుగురం కలిసి పిక్నిక్‌కి వెళదాం అనే ప్లాన్‌తో వచ్చాను."

"ప్చ్! పాపం."

"ఇప్పుడు మాత్రం ఏం? మనిద్దరం వెళదాం. మెకన్ గోల్డ్. బాగుంటుంది."

"అమ్మా వాళ్ళూ వెతుక్కోరూ?"

"అబ్బబ్బ! బుజ్జి పాపాయీ, ఏం వెతుక్కోరులే. ఓ స్లిప్ రాసి పెట్టి వెళదాం. నువ్వు త్వరగా తయారవ్వు. నేను టాక్సీ పిలుచుకు వస్తాను."

లోపలికి నడిపించుతూ తొందర చేశాడు కృష్ణ.

థియేటర్ నుంచి కార్లను, జనాన్ని తప్పించుకుని రోడ్డుమీదకు వచ్చారు కృష్ణ, సుజాత.

"నడిచి వెళదాం." కృష్ణ అన్నాడు.

"బాబోయ్! నే నంత దూరం నడవ లేను."

"ఓ సుకుమారీ! నీకు ఎప్పుడు కాళ్ళు నొప్పులుగా అనిపిస్తే అప్పుడు టాక్సీ ఎక్కుద్దాం. టాక్సీ దొరక్క పోతే నిన్ను ఎత్తుకు తీసుకు వెళతాను. సరేనా?"

సిగ్గుపడింది సుజాత. "వాన వచ్చే టట్లుగా ఉంది."

"అందుకేగా సరదాగా నడుద్దాం అంటూంది."

ఆకాశమంతా బాగా మబ్బులు ముసురుకుని ఉన్నాయి. చీకటి తెరల చాటున అప్పుడప్పుడే దీపాలంకరణ చేసు కుంటున్న మౌంట్‌రోడ్డు అందంగా కనిపిస్తూంది.

చల్లగా విసురుగా తాకుతున్న గాలికి చెదిరిపోతున్న ముంగురులు వెనక్కి నెట్టుకుంటూ కృష్ణపక్కనే నడుస్తూంది సుజాత.

గుంపులు గుంపులుగా అడ్డం వస్తున్న జనాన్ని తప్పించుకుంటూ, ముందుకు నడుస్తున్న కృష్ణ ఏవో కబుర్లు చెపుతూనే ఉన్నాడు.

"ఇలా మబ్బులు ముసురుకున్న వేళల్లో, మాధురికి. . . సారీ! మీ అమ్మకు ఇంట్లో కాలు నిలిచేది కాదు. గొడుగు చంకనేసుకుని, ఫ్రెండ్స్ ఇంటికని నాకు చెప్పి బయట పడేది. మేమిద్దరం ఆ ఊళ్ళో తిరగని చోటు లేదనుకో. తోటలూ, పొలాల్లో, గుళ్ళూ, చెరువులూ . . . అబ్బ! తెగ తిరిగేవాళ్ళంలే. మీ తాతయ్య కేకలేస్తున్నా పట్టించుకునే వాళ్ళం కాదు. కృష్ణ ఉన్నాడుగా తోడు, భయం ఫరవాలేదు అంటూ బయలుదేరింది మీ అమ్మ. మీ అమ్మకి నేను పెద్ద మగతోడు నన్ను మాట అప్పట్లో." చెప్తూ నవ్వాడు.

స్పెన్సర్స్ ముందు భాగాన గ్లాస్ కేసెస్‌లో అమర్చి ఉంచిన ఫర్నిచర్ చూస్తూంది సుజాత.

"నేను మబ్బులు గురించి కదూ చెప్తున్నాను? అప్పుడు ఎవ్వరి నోట్లో విన్నా 'మల్లీశ్వరి' పాటలే. మీ అమ్మ నా చేయి పట్టుకుని నడుస్తూ 'నల్లని మబ్బులు గుంపులు గుంపులు. . . తెల్లని కొంగలు బారులు బారులు' అని పాట మొదలెట్టేది. నా ఒక్కడికే వినిపించేటట్లే అనుకో. మధ్యలో తెల్లని కొంగలు ఏవీ అని అడిగేవాణ్ణి కావాలని. పాట ఆపేసి, పాపం, మబ్బుల మధ్యలో చిక్కడిపోయి గోల పెడ్తున్నాయి కొంగలు. వినపడ్డం లేదూ? అని నవ్వేది.'

"వానచినుకులు పడుతున్నాయి." మధ్యలో ఆకాశం వైపు చూస్తూ అంది సుజాత.

"పడనీ, ఏమవుతుంది?"

"తడిసిపోము?" కొంగు తల మీదికి లాక్కుంది.

"అందమైన అమ్మాయిలు వానలో తడుస్తూ నడుస్తుంటే ఎంత బాగుంటారో తెలుసా?"

తడిసిపోతున్న చీర అంచులు కాళ్ళకు అడ్డం పడుతుంటే, కుచ్చెళ్ళు కొద్దిగా ఎత్తి పట్టుకుని ఏ భావం ప్రస్ఫుటం కాకుండా చూసింది కృష్ణవైపు.

నవ్వేశాడు. "అలా ఆ షెల్టర్ కింద నిలబడదాం, పద. ఈ వానలో టాక్సీలు దొరకడంకూడా కష్టమే. కొంచెం సేపు వెయిట్ చేయాలి."

ఎక్కడినుంచో పడుతున్న లైట్ వెలుతురులో వాననీళ్ళకు కరిగి జారుతున్న కుంకుమ ముక్కు కొనమీద మెరుస్తుంటే, పాంట్ జేబులోంచి కర్చీఫ్ తీసి నెమ్మదిగా అద్దాడు కృష్ణ.

అతని వైపోసారి చూసి ప్రయత్నపూర్వకంగా చూపులు మరల్చుకుంది సుజాత.

"అదిగో, ఆ ఆటో ఖాళీగా వెళ్తున్నట్టుంది." సుజాతా ముందుకు నడిచింది.

ఆటోకి డబ్బు ఇచ్చేసి, లోపలికి వెళుతూ, "నిన్నిలా వానలో తడిపి తీసుకొచ్చినందుకు మీ డాడీ అక్షింతలు వేస్తారేమో" అని నవ్వుతూ అంటున్న కృష్ణ లోపల్నుంచి వినిపిస్తున్న మాటలకు ఆగిపోయాడు.

"కృష్ణ అంటే నీ కెలాంటి అభిప్రాయం ఉంది?" భాస్కరం గొంతు అది.

"మంచి అబ్బాయి." మాధురి సమాధానం ఇచ్చింది.

"అది తెలుసులేవోయ్. సుజాత విషయంలో."

"కొత్తగా ఏముంది చెప్పేందుకు? అతనికి మన సుజా అంటే విపరీతమైన ప్రేమ. కృష్ణను అల్లుడుగా చేసుకుంటే మనకు విశ్రాంతి."

"అవుననుకో. కానీ, ఇద్దరి మధ్య ఏజ్ డిఫరెన్స్ ఎక్కువగా లేదూ?"

"కానీ, కృష్ణ పెద్దవాడిలా అంత వయసును చూపించడు. అయినా, మా కాలంలో అబ్బాయికీ, అమ్మాయికీ మధ్య ఇరవై ఏళ్ల వ్యత్యాసం ఉండేది."

"ఏమోయ్, అమ్మాయ్! నువ్వే మహా అమృతం తాగి పుట్టావని నన్ను మరీ అంత ముసలాణ్ణి చెయ్యక్కర్లేదు. మీ అమ్మమ్మల కాలం సంగతి చెపుతావేమిటి మా కాలం అంటూ!"

"బాగుంది. నే నేదో అంటే మీరెందుకు భుజాలు తడుముకోవడం?" నవ్వుతూంది మాధురి.

అంతోషప్పుగా లోపలి వెళ్ళనీయకుండా ఓ చేత్తో భుజాన్ని పట్టి పెట్టుకుని ఆపిన కృష్ణ చేతిని లాగేసి హాల్లోకి వెళ్ళింది సుజాత.

"నేను వద్దంటున్నా వినకుండా వానలో నడిపించారు, డాడీ." అట్నుంచి తప్పించుకునేందుకు ముందే గారాం మొదలెట్టింది.

"అబ్బబ్బ! కొంచెం తడిసిందో లేదో ఒకటే గోడవ." మాధురి అందించిన టవల్‌తో తల తుడుచుకుంటూ అన్నాడు కృష్ణ.

"తండ్రీ కూతుళ్ళు ఎక్కడికి పోతాయ్? ఒక్క చినుకు పడితే చాలు చిందులేస్తారు తడియనకూడా. మబ్బు మబ్బుగా ఉంది, పదమంటూ హడావుడి పెట్టేసి తీసుకు వచ్చేశారు నన్ను ఈ వేళ. సరదాగా నడుద్దామండీ అంటే వినరే!"


"సరదా సరేలే. తడిసి జ్వరం తెచ్చుకుంటే నేను చావాలి నీతో." నవ్వాడు భాస్కర్.

"వానలో నడవాలని నాకు సరదాయే కానీ, తరవాతి రోజు జిడ్డులా తగులుకునే ఆ జలుబు పెద్ద బోర్." తండ్రికి వంత పాడింది సుజాత.

"నువ్వు వెళ్ళి బట్టలు మార్చుకురా. తిరిగొస్తానుకున్నావ్. అలాగే వచ్చేటప్పుడు వేడివేడిగా టీ చేసి పట్టుకురా, అమ్మా." భాస్కరం కూతుర్ని లోపలికి పంపేశాడు.

* * *

"డిగ్రీ వచ్చేసిందిగా? తరవాత ఏం చేద్దామని?" తీరిగ్గా కూతురు ఎదురుగా కూర్చుని అడిగింది మాధురి.



'ఫెమినా' పేజీలు తిరగవేస్తున్న సుజాత తలఎత్తి నెమ్మదిగా చెప్పింది.

"ఏం చేయమంటావమ్మా?"

"పెళ్ళి చేసేద్దాం అనుకుంటున్నారు మీ నాన్నగారు. కృష్ణకూడా అందుకు ఎదురుచూస్తున్నాడు." విషయాన్ని సూటిగా ప్రస్తావించింది.

చాలాసేపు మౌనంగా ఉండిపోయింది సుజాత.

"ఏం మాట్లాడవు? నీకూ ఇష్టమనే నను తెలుసనుకో. కానీ, అడగాలి కదా?"

"నేను. . . నేను ఆయన్ని చేసుకోను అమ్మా." ఎటో చూస్తూ చెప్పేసింది.

ఊహించని విషయం వింటు స్థాణువుగా ఉండిపోయింది మాధురి.

"సుజా! నువ్వేం మాట్లాడుతున్నది నీకు తెలుస్తూందా?" కాసేపటికి అడిగింది.

రెప్పలు పైకెత్తి తల్లి కళ్ళలోకి చూసి మళ్ళీ తల దించేసుకుంది సుజాత.

"కృష్ణకు నువ్వంటే చాలా ఇష్టం. వెర్రిగా అభిమానిస్తున్నాడు. కవిత్వంలో చెప్పాలంటే నిన్ను చెప్పలేనంతగా ఆరాధిస్తున్నాడు. ఈ విషయం తెలిస్తే అతను తట్టుకోలేడు, సుజా! ఇంతకీ నువ్వు వద్దనడానికి కారణం ఏమిటి? అలా మౌనంగా ఉండిపోతే ఎలా తెలుస్తుంది? చెప్పమ్మా. . ."

"వద్దమ్మా! నన్ను బలవంతం చేయకు. నువ్వు బాధ పడతావు."

"నన్ను చంపక అసలు విషయం చెప్పు." కసురుతున్నట్లే అంది మాధురి.

తల్లి కళ్ళలోకి సూటిగా చూస్తూ అంది: "కృష్ణ అభిమానించింది, ఆరాధించింది నన్ను కాదమ్మా. నాలో ఉన్న నిన్ను. . .నీ అందాన్ని. . ."

వింటున్న మాధురి సర్వ చైతన్యాలు తనలోనుంచి హఠాత్తుగా లాగేసినట్టుగా అయిపోయింది. మతి పోయినట్టుగా ఉంది ఆమెకు.

"వెర్రిదానిలా మాట్లాడకు. అతను నా కళ్ళకు తమ్ముడిలా కనబడతాడు."

"నీ గురించి చెప్పడం లేదమ్మా నేను."

బాధవంతంగా నవ్వింది సుజాత.

"నా కోసం మాత్రమే బతికే వాళ్ళే, నన్ను నన్నుగా ప్రేమించే వాడితో మాత్రమే నేను జీవితం పంచుకోగలనమ్మా. ఏ కారణం చేతనైనా గాని తను పొందలేని ఇంకెవరినో నాలో చూసి ఆరాధించే కృష్ణను నేను భరించలేను."

మాధురి ఎదురుగా ఉండలేక లేచి వెళ్ళిపోయింది సుజాత. దూరమవుతున్న కూతుర్ని వింతగా ఆశ్చర్యంగా చూస్తూ తల రెండు చేతుల మధ్య దింపి నొక్కుకుంది మాధురి. ☆